క్లుప్తంగా

ఏయూ బీవోఎస్ చైర్మన్‌కు అభినందనలు



చైర్మన్ ప్రొ.వెంకటేశ్వర్లును అభినందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఆంధ్రా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ పి.వెంకటేశ్వర్లును స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ గుర్తింపు సంఘం నాయకులు అభినందించారు. చైర్మన్‌ను గురువారం ఆయన చాంబర్‌లో కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ గిరిజన వర్గానికి చెందిన ప్రొఫెసర్‌ను చైర్మన్‌గా నియమించడం ఆనందదాయకమన్నారు. వీసీ ఆచార్య ప్రసాద రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘం ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఉపాధ్యక్షుడు డి. పుల్లారావు, స్టీల్ ప్లాంట్ కో–ఆపరేటివ్ స్టోర్స్ మాజీ అధ్యక్షుడు కె. పరంధామయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్ సుబ్బారాయుడు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు జోసెఫ్ పాల్గొన్నారు.

నేడు మహా పాదయాత్ర

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించనున్న ఆందోళనలో భాగంగా ఈ నెల 30న ఉక్కునగరంలోని తృష్ణ గ్రౌండ్స్‌లో నిర్వహించ తలపెట్టిన ఉక్కు ప్రజా గర్జనను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ కోరారు. ఇందులో భాగంగా ఈ నెల 20న శుక్రవారం ఉదయం 6.45 గంటలకు నడుపూరులోని అంబేడ్కర్ విగ్రహం నుంచి మహాపాదయాత్రను ప్రారంభించనున్నామని చెప్పారు. నిర్వాసిత కాలనీల్లో నిర్వహించనున్న ఈ యాత్రలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, నిర్వాసితులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అప్పన్నకు పచ్చలహారం బహూకరణ



సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం రూ. 30 వేలు విలువ చేసే వెండి హారాన్ని ఏపీ స్వర్ణకారుల సంఘం పీఆర్‌వో గుంటపల్లి ప్రసాద్ ఆలయ అలంకారి పురోహిత్ కరి సీతారామాచార్యులకు అందజేశారు. దేవస్థానం తరఫున అధికారులు రశీదును ప్రసాద్‌కు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్ రాజ్, పెనుమత్స శ్రీదేవివర్మ, అర్చకుడు టి.పి.రాజీవ్‌లోచన్ పాల్గొన్నారు.

యాప్‌లో ఓటర్ల వివరాలు



ఓటర్ల వివరాలపై మాట్లాడుతున్న నర్సింగరావు

పెదగంట్యాడ: జై బీజేపీ యాప్ ద్వారా ఓటర్ల వివరాలు నమోదు చేయాలని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు సూచించారు. మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జీలకర్ర భువనేశ్వరి దేవి అధ్యక్షతన పోలింగ్ బూత్ ఏజెంట్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవాస్ యోజన కార్యక్రమం కింద గాజువాక నియోజకవర్గంలోని 305 పోలింగ్ బూత్‌లను 84 శక్తి కేంద్రాలుగా విభజించామని తెలిపారు. ప్రతీ శక్తి కేంద్రం ప్రముఖ్‌కు మూడు కేంద్రాల చొప్పున కేటాయించామని చెప్పారు. వారంతా జై బీజేపీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓటర్ల వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో రామస్వామి, రంజిత్, రాహుల్ షా, రామునాయుడు పాల్గొన్నారు.

గోతులమయంగా జాతీయ రహదారి



అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా గోతులు

- టోల్‌గేటు నుంచి అగనంపూడి వంతెన వరకు పెద్ద గోతులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- నిర్వహణపై ఎన్‌హెచ్‌ఏఐ నిర్లక్ష్యం
- ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

అగనంపూడి: టోల్‌గేటు నుంచి అగనంపూడి వంతెన వరకు జాతీయ రహదారి గోతులమయమైంది. అడుగుకో గొయ్యి ఏర్పడడంతో వాహనచోదకులు బితుకు బితుకుమంటూ వాహనాలను నడపాల్సి వస్తుంది. వర్షాకాలం వెళ్లిపోయి రెండు మాసాలు కావస్తున్నా, గోతులను పూడ్చడంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని వాహనచోదకులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టోల్‌గేటు నుంచి అగనంపూడి మధ్య 15 చోట్ల రహదారి మధ్యలో గోతులు ఏర్పడ్డాయి. భారీ వాహనాల వేగ ధాటికి గోతులు లోతుగా మారి ద్విచక్ర వాహనచోదకులకు ప్రాణ సంకటంగా మారుతున్నాయి. ఇటీవల ఫార్మాసిటీకి విధులకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న నరేష్ అనే ఉద్యోగి గోతులను తప్పించే క్రమంలో, ఆ మార్గంలో వెనుక నుంచి వచ్చిన ఆటో నరేష్ వాహనాన్ని ఢీకొట్టింది. అయితే వాహనాలు నెమ్మదిగా వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాలికి గాయంతో నరేష్ బయటపడ్డారు.

ఇదీ పరిస్థితి..

- టోల్‌గేటు నుంచి అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్టీవో కార్యాలయం, పెట్రోల్‌బంక్, గల్లవానిపాలెం ప్రాంతాల వద్ద గోతులు ఎక్కువగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- అగనంపూడి, లంకెలపాలెం వంతెనపై కూడా పలు చోట్ల పెద్ద గోతులు ఏర్పడ్డాయి.
- వంతెన నుంచి టోల్‌గేటుకు వెళ్లే మార్గంలో అగనంపూడి సెక్టార్–1, బీసీ కాలనీ, పైడిమాంబ ఆలయం, శివాలయం, పెదమడక కూడలి, అగనంపూడి బస్టాప్‌ల వద్ద రోడ్డు మధ్యలో గోతులతో పాటు రోడ్డుకు ఎడమ వైపున ఆరు నుంచి ఎనిమిది అడుగుల వరకు రోడ్డు కోతకు గురైంది. దీంతో రోడ్డు అంచుల వద్ద వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

అధికారుల దృష్టికి పోలీసులు తీసుకువెళ్లినా...

దువ్వాడ ట్రాఫిక్ పోలీసులు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చలనం లేకపోవడంపై పోలీస్ అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారే కదా అని వాహనచోదకులు వేగంగా ప్రయాణిస్తారని, కానీ అకస్మాత్తుగా గోతులు వచ్చేసరికి, తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నారని ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినా ప్రయోజనం లేకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అగనంపూడి, లంకెలపాలెం వంతెనపై..



సెక్టార్–1 నుంచి బీసీ కాలనీకి మధ్యలో కోతకు గురైన రోడ్డు

పార్లమెంట్‌లో ప్రకటన చేసేవరకు ఉద్యమం

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో స్పష్టమైన ప్రకటన చేసేవరకు ఉక్కు ఉద్యమం ఆగదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో 707వ రోజు గురువారం ఎస్ఎంఎస్–1 కార్మికులు పాల్గొన్నారు. దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, జె.రామకృష్ణ, బి.అప్పారావు, జి.సుబ్బయ్య, వై.మస్తానప్ప, పూర్ణచంద్రరావు, రమణమూర్తి, బొడ్డు పైడిరాజు, సి.హెచ్. సన్యాసిరావు, గుమ్మడి నరేంద్ర, డి.శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంటును నష్టాల ఊబిలోకి నెట్టేందుకు యాజమాన్యం ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న త్రిష్ణా మైదానంలో నిర్వహించనున్న ఉక్కు ప్రజాగర్జనకు కార్మికులు, నిర్వాసితులు కుటుంబాలతో సహా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రానికి ఉక్కు ప్రతిష్ఠ తెలిసేలా నిరసన తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో డి.వి.నాగబాబు, టి.ఎస్.ఎన్.యు.వీరయ్య, కృష్ణమూర్తి, ఎం.వి.రమణ, ఎమ్.ఎస్.రావు, కృష్ణ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

నిర్వాసిత కాలనీల్లో విస్తృత ప్రచారం

ప్రజాగర్జన జయప్రదం చేయాలని పిలుపు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న ఉక్కు త్రిష్ణ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని కోరుతూ అగనంపూడి నిర్వాసిత కాలనీలు, ప్రధాన రహదారుల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. గురువారం ఉదయం ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు కరపత్రాలు, బ్యానర్లతో ప్రచారం నిర్వహించారు. బృందాలుగా ఏర్పడి పినమడక, డొంకాడ, పాత అగనంపూడి కాలనీల్లో పర్యటించారు. ఉక్కు పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. లక్షల కోట్ల విలువైన దేశ సంపదను కాపాడుకోవల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో జనపరెడ్డి నరసింగరావు, మామిడి నరసింగరావు, బొబ్బరి సూరి, గంతకోరు అప్పారావు, కరణం పైడిరాజు, బళ్ల పైడిరాజు, మోటూరి వెంకటరమణ, దాసరి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.



పాత అగనంపూడిలో ప్రచారం చేస్తున్న ఉక్కు నిర్వాసిత, కార్మిక సంఘాల ప్రతినిధులు

- కొండయ్యవలస సామాజిక భవనం వద్ద నిర్వహించిన సభలో పోరాట కమిటీ, నిర్వాసిత సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. నిర్వాసితుల త్యాగంతో ఏర్పడిన విశాఖ ఉక్కు భూములతో కేంద్రప్రభుత్వం వ్యాపారం చేయడానికి కుట్రలు చేస్తోందని, వాటిని నిర్వాసితులు ఐక్యంగా తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు విందుల వరహాలు, గుదే గజేంద్రరావు, శీరంశెట్టి గోవిందరావు, బలిరెడ్డి సత్యనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాత టైర్ల దుకాణంలో అగ్ని ప్రమాదం

భారీగా ఎగసిపడ్డ మంటలు

గాజువాక : స్థానిక శ్రీనగర్‌లోని సివిల్ సప్‌లెస్ గోడన్ల సమీపంలో గల ఒక పాతటైర్ల దుకాణంలో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వంట కోసం కర్రల పొయ్యి వెలిగించడానికి పెట్రోల్ పోయడంతో ఈ సంఘటన చోటుచేసుకున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సతేందర్ కుమార్ యాదవ్ అనే వ్యక్తి శ్రీనగర్‌లోని సివిల్ సప్‌లై గోడన్ల వద్ద పెట్రోల్ బంక్‌ను ఆనుకొని పాతటైర్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇద్దరు సిబ్బందిని నియమించుకొని పాత టైర్లకు పంక్చర్లు వేయడంతోపాటు రీబటనింగ్ పనులను నిర్వహిస్తున్నాడు. అందులోనే వంట చేసుకోవడం కోసం గురువారం కట్టెల పొయ్యి వెలిగించారు. అది మండటం కోసం అందులో పెట్రోల్ పోయడంతో ఒక్కసారిగా మంట పైకి వచ్చి అక్కడి పాతటైరుకు అంటుకుంది. ఆ మంట క్షణాల్లో మొత్తం దుకాణమంతా విస్తరించింది. దీంతో దట్టమైన పొగతో కూడిన మంటలు ఎగసిపడ్డాయి. పొగలు ఆ ప్రాంతాన్ని కమ్మేశాయి. సంఘటన చోటుచేసుకున్న దుకాణానికి ఆనుకొని పెట్రోల్ బంక్ కూడా ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బంది రెండు శకటాలతో అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గాజువాక సీఐ ఎల్. భాస్కరరావు సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రాథమిక విచారణ నిర్వహించారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

క్వారీ గుంతలో దిగి యువకుడు మృతి

సింహాచలం: క్వారీ గుంతలో స్నానానికి దిగి యువకుడు మృతి చెందిన ఘటన పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధి నరవ శివారులో చోటు చేసుకుంది. పెందుర్తి సీఐ గొలగాని అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. కూర్మన్నపాలెంలోని వుడా కాలనీలో ఉంటున్న నిడమనూరి యశ్వంత్ (22) నగరంలోని ఒక కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. యశ్వంత్‌కి ఫొటోషూట్ అంటే ఇష్టం. ఈ తరుణంలోనే గడిచిన బుధవారం తన ఇంటికి సమీపంలో ఉంటున్న ముగ్గురు బాలురతో ఫొటోలు తీస్తానని చెప్పి వారితో కలిసి నరవ శివారులోని క్వారీ గుంత వద్దకు ఫొటోషూట్‌కి వెళ్లాడు. క్వారీ గుంతలో స్నానానికి దిగి మునిగిపోయాడు. వెంటనే ముగ్గురు బాలురు 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. యశ్వంత్ తల్లి పద్మావతికి ఫోన్‌లో తెలిపారు. విషయం తెలుసుకున్న పెందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి గజ ఈతగాళ్ల సాయంతో బుధవారం సాయంత్రం వరకు గాలింపు జరిపారు. కానీ యశ్వంత్ జాడ కనిపించలేదు. రాత్రి అవుతుండటంతో గాలింపుని నిలుపుచేసి గురువారం ఉదయం మరోసారి గాలింపు చేపట్టగా యశ్వంత్ మృతదేహం బయటపడింది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన 72వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను కలుసుకున్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలతో సంబంధం లేకుండా ఈ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్, నాయకులు రాజాన వెంకటరావు, ఉరుకూటి అప్పారావు, మధుసూదనరావు, శ్రీను, మధు, ధనలక్ష్మి, నిర్మల, హేమలత, భవాని, పద్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

- తవ్వి, పూడ్చకుండా వదిలేసిన సిబ్బంది
- వారం రోజులుగా స్థానికుల అవస్థలు



సీడబ్ల్యూసీ ఎదురు రోడ్డులో ఇదీ పరిస్థితి..

గాజువాక: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ ఎదురుగా ఉన్న యూజీడీ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. మ్యాన్‌హోల్‌ను తెరవడానికి గొయ్యి తవ్విన జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది, తిరిగి దాన్ని పూడ్చకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ మ్యాన్‌హోల్ వద్ద మురుగునీటి కాలువ పూడుకుపోయి రోడ్‌పైకి మురుగు వచ్చేయడంతో శానిటరీ సిబ్బంది దాన్ని తవ్వారు. కాలువలోని వ్యర్థాలను తొలగించిన అనంతరం ఆ గుంతను తిరిగి పూడ్చడం మానేశారు. ఇప్పటికి వారం రోజులు గడిచినా సిబ్బంది దానివైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఈ కారణంగా ఆ రోడ్డులో ప్రయాణించే స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సీడబ్ల్యూసీ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారికి మ్యాన్‌హోల్ ఉన్న రోడ్డు అనుసంధానమై ఉండటంతో, వాహనచోదకులు అక్కడి వరకు వచ్చి అక్కడి నుంచి వేరే రోడ్డు వైపు మళ్లాల్సి వస్తోంది. రాత్రిపూట కొంతమంది ఆ గుంతను గమనించకుండా అందులో పడిపోతున్న సంఘటనలు కూడా ఉన్నాయని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి, గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

పబ్లిక్ డిమాండ్

ఆస్పత్రి స్థాయి మారినా పాత బోర్డేనా..!



సీహెచ్‌సీ పేరే కొనసాగుతున్న అగనంపూడి ఆస్పత్రి నేమ్ బోర్డు

అగనంపూడి: ఆస్పత్రి స్థాయి మారినా, అగనంపూడి ఏరియా ఆస్పత్రి నేమ్ బోర్డుపై మాత్రం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గానే కొనసాగుతోంది. టీడీపీ ప్రభుత్వం గత ఎన్నికలకు ముందుకు ఆస్పత్రి స్థాయిని వంద పడకలు గా మార్చుతూ, ఉత్తర్వులు జారీ చేసి వదిలేసినా.. తర్వాత వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి విశేష ప్రాధాన్యం ఇస్తూ నాడు–నేడు ద్వారా రూ.18కోట్లతో ఎంతో అభివృద్ధి చేసింది. భవన సముదాయాలు, ఇతర వసతులతో పాటు సిబ్బందినీ నియమించారు. వంద పడకల ఆస్పత్రికి కావల్సిన అన్ని సదుపాయాలు దాదాపు కల్పించారు. బడ్జెట్ మంజూరు తప్ప, అన్నీ ఏరియా ఆస్పత్రికి కావల్సిన మేరకే వసతులు చకచకా సాగుతున్నాయి. అయితే బోర్డు మాత్రం పాతదే కొనసాగుతోంది. దానినీ మార్చితే, ప్రజలకు సులువుగా అర్థం అవుతుంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. –ఇ.రాజేష్, చినమడక

విశ్వబ్రాహ్మణుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం: విశ్వబ్రాహ్మణ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రతినిధులు మిందిలోని మంత్రి నివాసంలో గురువారం ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం అమర్‌నాథ్‌ను సంఘం ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివకోటి శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు అనుపోజు సీతామహాలక్ష్మి, కోశాధికారి చంటిబాబు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాగర్జన విజయవంతం అందరి బాధ్యత

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న నిర్వహించనున్న ప్రజాగర్జనను విజయవంతం చేయాలని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని వాజ్‌పేయి స్టీల్‌ప్లాంట్ కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకుంటే, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ బాగున్న ప్లాంట్‌ను నాశనం చేయాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని కుట్ర చేస్తున్నారన్నారు. 700 రోజులకు పైగా ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా అఖిల పక్ష రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజా గర్జనను జయప్రదం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు కరణం సత్యారావు, ఎం. కోటేశ్వరరెడ్డి, ఎం. ప్రకాశ్, బొడ్డు రమణ, బాలాజీ, కరణం బాలయోగి, చట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న పైడిరాజు

అవయవ దాత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

పెదగంట్యాడ: బ్రెయిన్‌డెడ్ అయిన మహిళ అవయవాలను దానం చేసిన ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ 75వ వార్డు నాయకుడు శీకు ముసలినాయుడు భార్య లక్ష్మి అనారోగ్యంతో చికిత్స పొందుతూ, బ్రెయిన్ డెడ్ కావడంతో గురువారం ఆమె అవయవాలను దానం చేశారు. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఎంతో దుఃఖాన్ని భరిస్తూ కూడా, మరి కొందరికి జీవితాన్ని ప్రసాదించే అవయవ దానం చేసిన కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో గొందేశి మహేశ్వరరెడ్డి, గెద్దాడ రాజు, కొరిబిల్లి గోవిందరావు పాల్గొన్నారు.



మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

జాతిని జాగృతం చేసిన మహనీయుడు వేమన

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- ఘనంగా వేమన జయంతి



69వ వార్డులో వేమన విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి

పెదగంట్యాడ: సమాజంలోని అన్ని సమస్యలను భిన్న కోణాల్లో దర్శించి, తన పద్యాలతో జాతిని మేల్కొలిపిన మహనీయుడు యోగి వేమన అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వేమన జయంతిని పెదగంట్యాడ జంక్షన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ వేమన తన సాహిత్యంతో సామాజిక చైతన్యం తీసుకువచ్చారన్నారు. స్టీల్ వేమన సంఘం సభ్యుడు గొందేశి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, నాయకులు మహేశ్వరరెడ్డి, పెదరెడ్డి, భసా సాదురెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, వెంపాడ అప్పారావు, పులి రమణారెడ్డి, పిట్టా రెడ్డి, శ్రీనివాస రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యోగి వేమన చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

69వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో వేమన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన విగ్రహానికి కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వేమన పద్యాలు ఎంతో స్ఫూర్తిని నింపుతాయన్నారు. అనంతరం, సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేమన సంఘం అధ్యక్షుడు కొల్లి వెంకట రెడ్డి, కార్యదర్శి ఉప్పాడ రామచంద్రరావు, కొల్లి అప్పలరెడ్డి, కొల్లి వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఉక్కు ఇళ్ల స్థలాల గణన

స్టీల్‌ప్లాంట్ ఎస్‌డీసీ రామ్మోహనరావు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు కర్మాగార నిర్మాణం కోసం భూములను త్యాగం చేసిన నిర్వాసితులకు కేటాయించిన ఇళ్ల స్థలాల లెక్కను పక్కాగా గణన చేయనున్నామని స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జె.వి.వి.ఎస్.రామ్మోహనరావు తెలిపారు. స్థలాలను గురువారం పరిశీలించిన ఆయన అనంతరం సాక్షితో మాట్లాడారు. ఆర్ కార్డులు ఉన్నవారికి గతంలో పెదగంట్యాడ, వడ్లపూడి, అగనంపూడి తదితర నిర్వాసిత (ఆర్‌హెచ్ కాలనీలు) ప్రాంతాల్లో ప్లాట్లను కేటాయించామని, ఇంకా కొంతమందికి కేటాయించాల్సి ఉందని తెలిపారు. ఇప్పటి వరకు కేటాయించిన స్థలాలను లెక్కించి, ఖాళీగా ఉన్న ప్లాట్లను ఇంకా అందని వారికి కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ స్థలాల గణన కోసం ఇప్పటికే సచివాలయ సిబ్బంది, వీఆర్వోలకు పలు సూచనలు చేశామన్నారు. ప్లాట్లు పొందిన వారి వివరాలను సేకరించాలని ఆదేశించామన్నారు. నిర్వాసితులెవరూ ఈ విషయంలో అపోహ పడవద్దని కోరారు. ఆర్ కార్డుదారుల్లో స్థలాలను విక్రయించిన వారు కూడా ఉన్నారని, కొనుగోలు చేసుకున్న వారు భయపడకుండా సచివాలయ సిబ్బందికి, వీఆర్వోలకు వివరాలు అందజేసి సహకరించాలని కోరారు. పొరపాటున ప్లాట్ నెంబర్లు మారిపోయిన వారి వివరాలను కూడా సేకరించి, వారు ఉంటున్న ప్లాట్లను వారికే కేటాయించేలా ఆన్‌లైన్‌లో సరి చేస్తామన్నారు. సామాజిక అవసరాల నిమిత్తం అన్ని ఆర్‌హెచ్ కాలనీల్లో కొన్ని స్థలాలను ఖాళీగా వదిలేశామని, ఆ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి, వాటిని కూడా నిర్వాసితులకు కేటాయించేలా చూస్తామన్నారు.

యువతితో అసభ్య ప్రవర్తన.. యువకుడి అరెస్టు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో నడిచి వెళ్తున్న యువతితో అసభ్యంగా ప్రవర్తించిన ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రిలో వైద్యుని కుమార్తె మెడిసిన్ చదువుతోంది. ఆమె గురువారం రాత్రి 7 గంటల సమయంలో స్టీల్‌ప్లాంట్ సెక్టార్–8లో వాకింగ్ చేస్తున్నారు. అదే సెక్టార్‌లోని 115 క్వార్టర్ వద్ద స్కూటీపై కూర్చుని ఉన్న అగనంపూడికి చెందిన ఐసీఐసీఐ అసిస్టెంట్ మేనేజర్ ముచ్చల శివసాయి (25) ఆమెను వెనుక నుంచి పట్టుకున్నాడు. ఈ పరిణామంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. దీంతో అటుగా వెళ్తున్న వారు వచ్చి, అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేసి, స్టీల్‌ప్లాంట్ పోలీసులకు అప్పగించారు. సీఐ వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ వరలక్ష్మి సెక్షన్ 354 ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.